కథ

# ఢాం...హీం...క్రీం...

— గోపాలుని జయరాజచంద్ర

"పోడవాటి కోర్టనీ వాల్ష్ బౌండరీ లైన్ ఇవతల నుంచి వాయువేగంతో పరుగెత్తుకుంటూ వచ్చి బంతిని విసిరాడు. ఆరడుగుల జాంటీ రోడ్స్ మూడడుగులు ముందుకు వేసి సిక్సర్ కొట్టాడు" ఆంగ్ల వ్యాఖ్యానాన్ని ఉత్కంఠ రేకెత్తించే విధంగా తెనిగించుకుంటూ పోతోంది మున్నా. చెవులప్పగించి వింటున్నాడు బాబీ.

"బాబీ!"

"యస్ మమ్మీ!"

"మున్నా!"

"యస్ డాడీ!"

"చాల్చాల్లే ఇక రండిరా".

టీవీ మీదనుంచి తలల్ని ఇటు తిప్పారు బాబీ, మున్నాలు.

"ఇదేమన్నా క్లాసు రూమా? మేమేమన్నా టీచర్లమా?"

"ఏంటి డాడీ!" అమాయకంగా ప్రశ్నించారు.

"క్లాసులో అటెండెన్స్ పలికినట్టు ఆ గావు కేకలేంట్రా?"

"సారీ డాడీ! మమ్మల్ని ఎందుకు పిలిచి నట్టు?"

"మేము ఆఫీసుకెళుతున్నాం. ఇల్లు జాగ్రత్త!"

"ఇవాళ కొత్తగా చెబుతున్నారేమిటి?"

"మరి చెప్పక తప్పడం లేదు. మీరు టీవీలో లీనమైపోయారుగా!"

"మీరు నిశ్చింతగా వెళ్ళిరండి. మేం చూసు కుంటాం గదా!"

"ఏంటి చూసుకునేది మీ మొహం! క్రికెట్ మ్యాచో! కార్టూన్ సీరియల్ అనుకున్నారా ఇంటి జాగ్రత్త అంటే?"

"ఇరవై నాలుగ్గంటలూ టీవీ చూస్తున్నట్టుగా తిడతారేం?"

"మరి మీకు వేరే ధ్యాసే లేదు కదా!"

"...డాడీ"

"యస్. లైటు పురుగులకంటే ఘోరంగా మీరు టీవీ మీద వాలిపోయారు కద్రా!"

"సెలవుల్లో పర్మిషన్ తీసుకున్నాము గదా! అలా తిడతారెందుకని?"

"చాల్చాలు! అది దూరదర్శనే అయినా మరీ అంత దగ్గరగా చూస్తే కళ్ళు పోతాయి".

"మీరు నిశ్చింతగా వెళ్ళిరండి! మేము కేర్‌ఫుల్‌గానే వుంటాం!".

"సరే! పెరట్లో ఎక్కడి సామాన్లు అక్కడే వున్నాయి. జాగ్రత్తగా చూసుకోండి" తల్లి సంగీతలక్ష్మి ముక్తాయింపుగా చెప్పింది.

"ఘోరంగా ఔటైన జాంటీ రోడ్స్ తల మీద హెల్మెట్ తీసి మ్యాట్‌కి తగిలించుకుని పెవిలియన్ దారి పట్టాడు!"

అది విన్న వెంటనే పిల్లలిద్దరి తలలూ టీవీ తిరుగుడు పువ్వులయ్యాయి.

టీవీలో కరతాళ ధ్వని కొనసాగుతూనే వుంది.

"ముందా తలలు ఇటు తిప్పండి. లేకపోతే తీసి పారేస్తాను" గదమాయించాడు తండ్రి.

అదేదో హారర్ సినిమాలోలా మనుషులు తిరక్కుండా తలల్ని తిప్పేశారు.

"జాగ్రత్తగా వినండి. దొడ్డి నిండా బోలెడు బట్టలు ఆరేసి వున్నాయి. సాయంత్రం అన్నీ తీసి లోపల పెట్టండి".

"మొత్తం ఎన్ని బట్టలు డాడీ!" కొంటెగా అడిగింది మున్నా.

"మమ్మీ నడక్కుండా సన్నడుగుతావేంటి రాస్కెల్!"

"సారీ డాడీ!" అనేసి మూతి సున్నాలా చుట్టేసింది మున్నా.

"చాల్లే తెలివి! చిన్నా పెద్దా కలిపి మొత్తం ఇరవై ఆరు" తిరిగి చెప్పాడు తండ్రి.

కిసుక్కున షోడా కొట్టినట్టు నవ్వింది మున్నా.

"ఈరోజు పనిమనిషి రంగమ్మ రాలేదుగా. అందుకనే మీ నాన్నకు అంత కచ్చితంగా తెలుసు" కవర్‌చేయబోయింది సంగీతలక్ష్మి.

స్కూటర్ స్టార్ట్ చేసి కాంపౌండ్ బయటకు వెళ్ళిపోతూ జాగ్రత్తల రికార్డు పునరావృత్తం చేసి—

"టా...టా" అంటూ అరిచారు మున్నా, బాబీల డాడీ మమ్మీ.

"బిర్లా...బిర్లా" అంటూ జవాబిచ్చారా గడుగ్గాయిలు.

లోపలికొచ్చి తలుపులు మూసుకుని తిరిగి టీవీ ముందు చతికిలబడ్డారు.

"ఆరు వికెట్లు కోల్పోయిన దక్షిణాఫ్రికా చిక్కుల్లో పడింది. ఏడడుగుల ఆంబ్రోస్ వికెట్ల సప్తాహం చేసుకుంటున్నాడు" ఆంగ్లంలో వ్యాఖ్యానం సాగిపోతోంది. స్టేడియం అంతా చప్పట్లతో, ఈలలతో కోలాహలంగా వుంది.

"అక్కా ఆంబ్రోస్ బాల్ మీద మనం ఎక్కి కూర్చుంటే గుంటూరు నుంచి విజయవాడ వెళ్ళడానికి ఎంత సేపు పడుతుందే?"

"నువ్వు నోరు మూసుకున్నంత సేపు!"

"ఇవ్వడక్కడ టైమెంతౌతుందే?" అమాయక త్వాన్ని బౌల్ చేశాడు బాబీ.

"నీ క్వశ్చెన్ బ్యాంక్ కట్టిపెట్టి మ్యాచ్ చూడు" స్టంపింగ్ చేసింది మున్నా.

తన చేతకానితనాన్ని అల్లరిలోకి తర్జుమా చేసిన బాబీ "చూయింగ్ గమ్ కొనిపెట్టు" అంటూ మారాం చేశాడు.

"ఇప్పుడెందుకురా చూయింగ్ గమ్!" అని తమ్ముణ్ణి కోప్పడింది మున్నా.

"మ్యాచ్ చూసి అలసట వచ్చేసినట్టుంటేనూ!" అంటూ నీరసం నటించాడు మున్నా.

చంపేస్తానని తమ్ముడి తలమీద మొట్టికాయ వేయబోయింది మున్నా.

అక్క బారి నుంచి తప్పించుకోవడానికి పక్కకు గెంతాడు బాబీ.

సరిగ్గా అదే సమయానికి బయట ఏదో శబ్దమైంది. మొదటగా అది మున్నా చెవిన పడింది. తక్షణం తమ్ముణ్ణి హెచ్చరించింది.

"అంతా నీ భ్రమ లేవే! నోర్మూసుకుని స్కోరు విను" అంటూ బదులిచ్చాడు.

"నిజంగానే బయటో చప్పుడైందిరా".

"ఏం కాలేదులేవే! అక్కడ మెక్‌మిలన్ వికెట్ పడింది. అదీ శబ్దం" అనేసిన బాబీ మళ్ళీ



మ్యాచ్ చూడటంలో నిమగ్నమయ్యాడు.

కాసేపటి తర్వాత బయట నుంచి మళ్ళీ శబ్దం వినబడింది. తనకేమీ వినబడనట్టే టీవీ చూస్తుండి పోయాడు బాబీ.

"ఈసారి కిర్‌స్టైన్ కాలుజారి పడ్డాడా ఏంటి?" కోపంగా అడిగింది మున్నా.

"ఛీ! నీకన్నీ భయాలే" అంటూ రోషపడిన బాబీ ఉక్రోషంతో టీవీ కట్టేయబోయాడు. వద్దని వారించి ఇంకాస్త సౌండు పెంచింది మున్నా. ఆ తర్వాత బాబీ చేయి పట్టుకుని చిన్నగా వంటింట్లోకి వెళ్ళి కిటికీ రెక్క సందులోంచి బయటకు చూపింది.

"అవిగోనే! ఏవో పాదాలు కనబడుతున్నాయి. త్వరగా వెళ్ళి కాలిక్యులేటర్ పట్రావే. లెక్కబెడదాం!"అన్నాడు బాబీ అక్క చెవిలో.

"నీ బొంద! రెండు కాళ్ళూ క్లియర్‌గా కనబడటం లేదు. సిగ్గు లేకుండా కాలిక్యులేటర్ దేనికిరా!" విసుక్కుంది తమ్ముణ్ణి. నాలుక్కరుచుకుని పూర్తిగా వంగి సందులోంచి బయట దృశ్యాన్ని చూస్తున్నాడు బాబీ.

"నన్ను తోసెయ్యకు. నాకు కనబడటం లేదు" మళ్ళీ విసుక్కుంది తమ్ముణ్ణి.

కిటికీ రెక్క ఇంకొంచెం తెరిచాడు బాబీ. మడమల పైనుంచి నీలం ప్యాంటు కనబడింది. ఇంకాస్త పైకి చూశారిద్దరూ. చిరుగుల బనీను దర్శనమిచ్చింది. తమ చూపుల్ని ఈసారి ఇంకొంచెం పైకి సారించారు. బనీనుకి ఒక మెడ, దాని చుట్టూ నల్లటి తాడు, దానికో తాయెత్తు అగుపించాయి. ఈసారి భయం భయంగా ఇంకాస్త పైకి పాకాయి వాళ్ళ చూపులు. గుబురు మీసాలూ, పెరిగిన గడ్డం చేలో చెల్లాచెదరైన గడ్డివామిలా

వున్నాయి. అప్పుడు మీసాల వెనుక నుంచి ముఖం కనబడింది. కిటికీ లోంచి తొంగి చూస్తున్నట్టుగా ఆ మీసాల్లోంచి తన రెండు కళ్ళతోటీ గుండ్రంగా చూస్తున్నాడా వ్యక్తి.

మున్నా చేయి గట్టిగా నొక్కి "దొంగ అనుకుంటానే" అన్నాడు మెల్లగా బాబీ.

"నీ ముఖం! అనుకుంటానేంటి! దొంగేరా బాబూ".

"ఏం చేద్దామని వచ్చుంటాడే?"

"వాడి వాలకం చూస్తుంటే దొడ్లో బట్టలూ, సామాన్లూ కాజేయడానికే ప్లాన్ చేస్తున్నాడనుకుంటా" అంది మున్నా.

"అయితే మనమేం చేద్దామే?" భయం భయంగా వుంది బాబీ ప్రశ్న.

కిర్‌స్టన్ వికెట్ పడిపోవడంతో గ్యాలరీలో పెద్దగా గోల బయల్దేరింది. ఆ శబ్దం టీవీ లోంచి బిగ్గరగా వినబడుతోంది.

ఆ వ్యక్తి ఆ శబ్దానికి ఉలిక్కిపడ్డాడు. వెంటనే కంగారుగా దండెం మీద ఆరేసిన బట్టల వెనక్కి వెళ్ళి తల దాచుకున్నాడు.

"అదేంటి నాన్న ప్యాంటు వెనక్కి వెళ్ళి దాక్కున్నాడు. దాన్ని కాజేస్తాడా ఏంటి?" అనుమానాన్ని

స్పిన్ చేశాడు బాబీ.

'నీ స్పిన్ బౌలింగ్ ఆపరా!" అని తమ్ముణ్ణి వారించింది మున్నా.

"అదుగో చూడవే ఎలా నవ్వుతున్నాడో" అన్నాడు బాబీ.

ఆరేసిన ప్యాంటు కాళ్ళ సందుల్లోంచి ఆ అపరిచిత వ్యక్తి మొహం కనపడుతోంది. అతని పెదవుల మీద పల్చని నవ్వు.

"నీ డొల్ల గుగ్గిలు కట్టిపెట్టు. టీవీలో గోలకి అదిరిపడి దాక్కున్నాడతడు. ఆ తర్వాత గ్రహించాడనుకుంటాను. నవ్వుకుంటున్నాడు". వైడ్ బాల్ అని డిక్లేర్ చేసిన అంపైర్‌లా వుంది మున్నా సమాధానం.

పరిసరాలను పరికించి చూసిన ఆగంతకుడు దండెంమీద ఆరేసిన దుప్పటిని వేలమీద పరిచాడు.

అది చూసిన బాబీ ఉత్కంఠను ఆపుకోలేక "నాన్న కాశ్మీర్ నుంచి తెచ్చిన శాలువానే అదీ" అన్నాడు.

"నోరు మూసుకుని వాడేం చేయబోతున్నాడో చూడరా" అంది ఆవేశంగా. బౌండ్రీలైన్ దగ్గర నుంచి థ్రో చేసి మిడిల్ స్టంప్ పడగొట్టినట్టుగా వుంది మున్నా సమాధానం.

ఎడం చేయి నోటికి అడ్డుపెట్టుకున్నా తన కుడి చేత్తో మున్నా భుజం నొక్కేస్తున్నాడు బాబీ.

"నా భుజం వదలరా! నువ్వు కంగారు పడటమే కాకుండా నన్ను కూడా కంగారు పెట్టేస్తున్నావు" అంది కోపంగా.

భుజం మీద నుంచి చేయి తీసేసిన బాబీ "నాకేదో భయంగా వుందే" అన్నాడు.

"ముందు నన్ను ఆలోచించుకోనివ్వరా" అన్నది మున్నా.

"అది కాదే. నాన్న మొన్న నా పుట్టిన రోజుకి కొన్న డ్రెస్ కూడా తీసేస్తున్నాడే. అయినా అంతవాడికి నా డ్రెస్ ఎలా సరిపోతుందే?" అనుమానాన్ని విసిరాడు.

"నువ్వు మరీ వైడ్ ప్రశ్నలేస్తున్నావురా! కొంచెం దూరంగా జరిగి కూర్చో".

బాబీ అక్కకి ఇంకా దగ్గరగా వచ్చి నిలబడ్డాడు.

'దొడ్లో వున్న బట్టల్నీ, వస్తువుల్నీ ఏవిధంగా కాపాడాలా?' అని మున్నా బుర్ర చురుగ్గా ఆలోచిస్తోంది. ఎంత ఆలోచించినా సరైన ప్లాన్ తట్టడం లేదు.

తను ఎంత అరచి గీపెట్టినా రోడ్డు మీద జనానికి వినబడదనే విషయం ఆమెకు కచ్చితంగా అర్ధమైపోయింది.

భయంతో బాబీ అక్క భుజాల్ని, చేతుల్నీ నలిపేస్తున్నాడు. మధ్య మధ్యలో గుంజేస్తున్నాడు.

ఆగంతకుడు తమని ఎక్కడ గమనిస్తాడో అని కిటికీ తలుపుల్ని దగ్గరగా వేసి వచ్చింది మున్నా. చప్పున ఆ చిన్ని బుర్రలో ఓ ఐడియా తళుక్కున మెరిసింది. అంతే బాబీ చేతుల్ని పక్కకు తోసేసి ఒక్క వుదుటున పరుగెత్తుకుంటూ వెళ్ళింది. మధ్యలో గుమ్మం వద్ద ఆగి– "ఒరే బాబీ! వాడినే గమనిస్తూ వుండరా! ఇప్పుడే వచ్చేస్తాను" అని గుసగుసగా చెప్పేసి బెడ్‌రూమ్‌లోకి వెళ్ళింది.

బట్టలన్నీ మూటగట్టి పక్కనే వున్న చెట్టు కొమ్మకు తగిలించి తీరిగ్గా బీడీ వెలిగించాడు ఆగంతకుడు. అతణ్ణే గమనిస్తున్న బాబీ తల తిప్పి పక్కకు చూశాడు.

ఒక చేత్తో బ్లూ కలర్ ప్లాస్టిక్ మగ్గు, రెండో చేత్తో రెండు కలర్ ట్యూబులూ పట్టుకుని హడావిడిగా వచ్చేసింది మున్నా.

అక్క ఏం చేయబోతోందో అర్ధం కాని బాబీ దీక్షగా ఆమెనే వాచ్ చేస్తున్నాడు.

చేతిలో వున్న రెండు ట్యూబుల్లోని క్రీమ్‌ని గబగబా మగ్గులోకి పిండేసింది.

కన్నార్పకుండా చూస్తూ అక్కనే గమనిస్తోన్న బాబీ మధ్య మధ్యలో తిలతిప్పి కిటికీ లోంచి దొంగను గమనిస్తున్నాడు.

"ఆ ట్యూబుల్లోని క్రీమ్‌ని మగ్గులోకి ఎందుకు పిండినట్టు?" ఆసక్తి అణచుకోలేక అడిగాడు బాబీ.

"చివరి దాకా నోరు మెదవకుండా చూస్తూ వుండంతే!" తమ్ముడికి ఆర్డరు వేసింది.

తన ప్రయత్న లోపం లేకుండా ఆ ట్యూబుల మీద రాసున్న ప్రింటెడ్ అక్షరాల్ని చదవడానికి ప్రత్నించాడు బాబీ. కనబడలేదు. బుర్రంతా రెండు చేతులతోటీ బరుక్కున్నాడు కోపంగా.

రోషంతో వున్న తమ్ముణ్ణి "వాడే పొజిషన్‌లో వున్నాడో, ఎంత ధూరంలో వున్నాడో చూసి చెప్పరా!" అంది.

"మన దొడ్డి తలుపు తీస్తే సరిగ్గా వాడి వీపు మనకి కనబడుతుంది" అని చెప్పాడు బాబీ.

చప్పుడు చేయకుండా తలుపు తీయమంది. అక్క చెప్పినట్టే చేశాడు వాడు.

మగ్గు తీసుకుని తలుపు దగ్గరకెళ్ళింది మున్నా. బాబీ తలుపు తీసిన మరుక్షణం పరుగెత్తుకుంటూ బయటకెళ్ళింది.

ఏదో శబ్దమవ్వడంతో కంగారుగా వెనక్కి

## జాకీ స్టూడియోకి అగ్నిప్రమాదం

'ఇన్ హౌస్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో ముంబాయి అంధేరి వెస్ట్‌లోని లింక్ రోడ్‌లో ఉన్న ఒక స్టూడియో అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. అయితే దీనికి యాజమాని ప్రముఖ హీరో జాకీష్రాఫ్ మాత్రం ఈ విషయంలో పెద్దగా వర్రీ కావల్సిన పనిలేదు. ఓ వారం పది రోజుల్లో మళ్లీ అన్ని కొనేస్తాం అంటున్నాడు.



తిరిగాడా ఆగంతకుడు.

ఆ సమయం కోసమే ఎదురు చూస్తోన్న మున్నా మగ్గులో వున్న క్రీమ్‌ని వాడి మొహం మీద వెదజల్లింది ఫోర్స్‌గా. ఏం జరిగిందో అర్థం కాని అతగాడు ఆ హఠాత్పరిణామానికి భీతిల్లి "బాబోయ్" అంటూ కంగారుగా గోడదూకి మాయమయ్యాడు.

బాబీకి ఆ ఆగంతకుడు ఎప్పడు అదృశ్యమయ్యాడో అర్థం కాలేదు.

'యురేకా!" అంటూ దొడ్డి అంతా ఆనందంగా పరుగులు తీస్తోంది మున్నా.

అక్క ఉత్సాహంలో బాబీ కూడా పాలు పంచుకుంటూ—

"అక్కా! వాడిమీద ఏం చల్లావో చెప్పవే! ప్లీజ్! ప్లీజ్" అంటూ బ్రతిమిలాడాడు.

"అంత మాత్రం కనిపెట్టలేకపోయావా? చెప్పకో చూద్దాం!" అంటూ తమ్ముడికి సవాలు విసిరింది థర్డ్ అంపైర్‌కి అప్పీల్ చేసినట్టు.

"చెప్పనా!"

"చెప్ప".

"మనింట్లో అమ్మ రాసుకునే వేపాకు వాని షింగ్ క్రీమ్‌ని నీళ్ళల్లో కలిపి వాడిమీద ఫోర్సుగా పోశావంతే!"

"ఆ!"

బయట స్కూటరాగిన చప్పడైంది. వెళ్ళి తలుపు తీసింది మున్నా.

"ఏమిటే అలా వున్నారూ?" అని ప్రశ్నించింది సంగీత లక్ష్మి.

"అమ్మా! మరేమో..మరేమో..." అంటూ బాబీ ఏదో చెప్పబోతోంటే మున్నా అందుకుని—

"ఓ దొంగ మన పెరట్లోకి వచ్చి ఆరేసిన బట్టలన్నింటినీ మూట కట్టాడే. వెనుక గది తలుపులు ఎవ్వరు తెరుస్తామా! అన్నట్టు గోతికాడ నక్కలా పొంచి కూర్చున్నాడు. మేం వాడినే గమనిస్తూ భయపెట్టి పారిపోయేలా చేశాం!" అంటూ తను చేసింది వర్ణించి చెప్పింది మున్నా.

సుబ్బారావు నోరు తెరుచుకుని వింటుండిపోయాడు. సంగీత లక్ష్మి మున్నా, బాబీల సాహసాన్ని మెచ్చుకుంటూ ఆప్యాయంగా వారిని దగ్గరకు తీసుకుంది.

### అనిల్ కపూర్ తీరని కోరిక

మామూలు సినిమా ప్రేక్షకులకి తమ అభిమాన హీరో హీరోయిన్‌లని చూడడం, మాట్లాడడం లాంటివి తీరని కోరికలుగానే మిగిలిపోతాయి. అయితే టాప్ హీరో హీరోయిన్లకి కూడా కొన్ని తీరని కోరికలుంటాయంటున్నాడు అనిల్ కపూర్. తాను ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో హీరోయిన్ రేఖ అంటే వల్లమాలిన అభిమానం వుండేదట. అయితే దీన్ని రేఖతో చెప్పాలన్న కోరిక మాత్రం ఇప్పటికీ తీరలేదట. కుర్ర హీరోయిన్‌లతో లాభం లేదని సీనియర్ రేఖకి గాలం వేస్తున్నాడన్నమాట.



## విన్నపాలు

దూకనన్నా దుకుతాను గానీ ఈ కృష్ణవేణి కబరీ భారాన్ని వీడలేను వస్తున్నాడు షేక్ చినమౌలా సాబ్ అలల మీద కనుకొలను మీద ఎలా వీడి పోనిక ప్రాణానిదేముందెపుడూ అపుడపుడూ వస్తూ పోతూంటుంది అలవాటయిన మృత్యువే గదా అదిన్నూ గాక ఆ ఉంచుకున్నదదెటూనూ ఎవడితోనో ఒకడితో నేనెంత నిద్రగాచినా లేచిపోతుందెటూనూ విశాల విశ్వం మాత్రం విశ్వ హృదయంతో ప్రేమిస్తూనే ఉంటుందా లేదా ప్రతి పర్వదినానా కొత్త కోడలిలా కుడిపాదం నీ నుదిటిపై మోపుతూ అందునా అంచేతే ఎక్కడికని పోనిక నేనెటూ మరో మరో రూపంలో పరంపరగా వస్తోనే ఉంటాను గాదా నా దేహమే అందరి గేహమయి ఈ ప్రపంచోత్సవంలో నేనెంత దిక్కులేని దీనుణ్ణయినానూ ఎవరూ లేరనే మనేది అదెందుకు అంతగ్గాకపోతే ప్లాట్‌ఫాం టిక్కట్టోటి నిజంగానే కొనుక్కుని వచ్చే వెళ్ళే రైళ్ళ సుఖ దుఃఖాల్ని బుగ్గల మీదికి జార్చుకోవచ్చు లేదా వృద్ధాప్యపు సాయంతనాలలో ఆశ్రమాలలో సర్వదాస్తినీ రాసి పారేసి జాయినయిపోవచ్చు అనాథ పిల్లల ఆశల చూపుల్లో వాలుగరిటె పళ్ళు పంచుకోవచ్చు అసలీ ప్రపంచ శరీరం స్త్రీ దేహం కొండ అంచుల్లోకి అంతమయ్యే ఈ నగర వీధుల్ని ఎన్నని ఎట్లాని దీర్ఘ కాపలా కాచాను గాను అనుమానాస్పద వ్యక్తిగా రాత్రుళ్ళలో నెట్టకండి నన్ను నదిలోకి

—'మో'